క్లుప్తంగా

30న స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ

బాలానగర్: డీఎస్పీ బాలానగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు పరశురాం మహారాజ్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల స్వరాజ్యమే లక్ష్యంగా డా. విశారదన్ మహారాజ్ చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ఓపెన్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ భారీ బహిరంగసభకు బాలనగర్ మండల కేంద్రం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ మహారాజ్, బాలానగర్ మండల కమిటీ సభ్యులు రాజు మహారాజ్, పెద్ద కురుమయ్య మహారాజ్, మల్లేష్ మహారాజ్, సురేష్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ-బ్లాక్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బాలానర్సింహ

బాలానగర్: డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన బందిగ బాలానర్సింహ కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఏ-బ్లాక్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ చైర్మన్ పత్తికుమార్ బుధవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు.

గంగాధర స్వామికి పురోహిత వైభవ నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గంగాధర్‌స్వామి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కారంలో భాగంగా కూకట్‌పల్లిలోని పాపిరెడ్డినగర్లో శ్రీ వీరాంజనేయ శివాలయం అర్చకులు పి. గంగాధర్ స్వామి వైదిక పురోహిత వైభవ నంది పురస్కారాన్ని అందుకున్నారు. అదే విధంగా చెన్నారెడ్డినగర్‌కు చెందిన ఎం. వినయ్‌కుమార్ శాస్త్రి, కొంపల్లికి చెందిన విజయ్‌కుమార్ స్వాములు నంది పురస్కారాలను అందుకున్నారు.

పీహెచ్‌డీ ఫీజులు తగ్గించండి



వినోద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ వీసీ ప్రొ.రవీందర్‌కు లేఖ రాశారు. బుధవారం ఓయూ పీహెచ్‌డీ విద్యార్థులు మినిస్టర్స్ క్వార్టర్సులోని వినోద్‌కుమార్‌ను కలిసి ఫీజుల పెంపుపై వివరించి వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన వినోద్‌కుమార్ ఫీజులు తగ్గించాలని వీసీ లేఖ రాసినట్లు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో సత్య, అఖిల్, మహేష్, వెంకట్, శ్రీవాస్తవ, మనోజ్ పాల్గొన్నారు.

15 గంటలు నో కరెంట్

ఏడో ఫేజ్‌లో విద్యుత్ లేక విలవిల!

- రాత్రి నుంచి ఉదయం వరకు నిలిచిన విద్యుత్ సరఫరా
- ఇబ్బందులు పడిన స్థానికులు
- పునరుద్ధరించాలని వేడుకున్నా స్పందించని వైనం
- విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం

కేపీహెచ్‌బీకాలనీ: వేసవికాలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అలవాటు పడిన ప్రజలు ఏ కొద్దిసేపో విద్యుత్ సరఫరా లేకపోతే వస్తుందిలే అనే నమ్మకంతో వేచి చూస్తారు. కానీ ఏకంగా 15 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇక అక్కడి ప్రజల కష్టాలు ఎవరికి చెప్పుకోవాలి. నేరుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం గమనార్హం.

- ఏకంగా 15 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకుండా రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కరెంటు కోసం వేసి చూసిన ప్రజలు అటు అధికారులను.. ఇటు ప్రభుత్వాన్ని నిందిస్తూ ఉసూరుమంటూ కాలం వెల్లదీశారు. ఈ సంఘటన ఏ మారుమూల గ్రామంలోనో చోటుచేసుకోలేదు. ఏకంగా హైటెక్‌సిటీకి కూతవేటు దూరంలోని కేపీహెచ్‌బీకాలనీ ఏడో ఫేజ్‌లో చోటుచేసుకుంది. ఇది విద్యుత్‌శాఖ అధికారుల 'హైటెక్' పనితీరుకు అద్దం పడుతోంది.
- కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ ఏడో ఫేజ్‌లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులు వర్షం రావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురిసినంత సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయి తిరిగి వచ్చింది. కానీ ఏడో ఫేజ్‌లో మాత్రం పోయిన కరెంటు మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు రాకపోవడం గమనార్హం. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు ఎవరికి వారుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందన లేదు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌లు, కరెంటు మోటార్లు పనిచేయకపోవడంతో రాత్రంతా జాగారం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు నిర్లక్ష్యం వీడి వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. మంగళవారం రాత్రి కాలనీలో విద్యుత్ నిలిచిపోవడంతో అనేకమార్లు ఫిర్యాదు చేసేందుకు యత్నించినా స్పందన కరువైంది. గతంలోనూ అనేక మార్లు ఇక్కడి విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినా ఏఈతో పాటు ఇతర అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకంగా ఏడో ఫేజ్‌కు కనీసం ఒక లైన్‌మెన్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. – అంజిబాబు, కాలనీ సెక్రటరీ

గాలివానతోనే అంతరాయం

మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఒకటీ రెండు చోట్లు ఫీడర్లలో ఫీజులు పోయి, లైన్‌లు కట్ అయిన చోట్ల మరుసటి రోజు ఉదయం మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాం. ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం అంటూ ఉండదు. వేలాది కనెక్షన్లు ఉన్న చోట ఒకేసారి అందరూ ఫిర్యాదు చేస్తుంటే లైన్ బిజీగా ఉంటుంది తప్ప అందరి ఫిర్యాదులకు స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఏడో ఫేజు పార్కువద్ద ఉన్న ఫీడర్‌కు మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ సమస్య తలెత్తడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాల్సి వచ్చింది. – శంకర్, బాలాజీనగర్ సెక్షన్ ఏఈ

నైపుణ్య ప్రదర్శనతోనే ఉజ్వల భవిష్యత్



గ్రేడ్ సపరేట్ జంక్షన్‌ను ప్రదర్శిస్తున్న సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు



జేఎన్‌టీయూహెచ్‌లో సాంకేతికోత్సవాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వీసీ కట్టా నర్సింహారెడ్డి

జేఎన్‌టీయూహెచ్‌లో సాంకేతికోత్సవం ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న చదువుకు తమ నైపుణ్యాన్ని జోడించి ఆవిష్కరణల రూపంలో ప్రదర్శించినప్పుడే ఉజ్వల భవిష్యత్‌ను అందుకుంటారని జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూహెచ్‌లో సాంకేతికోత్సవం-2023ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిఏటా జేఎన్‌టీయూహెచ్‌లో సాంకేతికోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. చదివిన చదువులను సమాజానికి ఉపయోగపడే విధంగా ఆధునిక ఆవిష్కరణలతో విద్యార్థులు ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. పోటీ ప్రపంచంలో దూసుకుపోయేందుకు అనువైన సాంకేతిక విద్యాబోధనతో పాటు అవకాశాలను కల్పించేందుకు జేఎన్‌టీయూహెచ్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. జయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపల్ జీవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభాగాల వారీగా ప్రదర్శనలు...

సివిల్ ఇంజినీరింగ్ విభాగం స్థపత్య పేరుతో, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం కొన్సెన్సెస్ పేరుతో, కంప్యూటర్ సైన్స్ విభాగం క్వెస్ట్ పేరుతో, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ప్రజ్ఞా పేరుతో, మెటలర్జికల్ విభాగం ఆయాస్ పేరుతో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం జీనోస్ పేరుతో, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం స్ఫూర్తి పేరుతో ఎంబీఏ విభాగం ఐదీప్ పేరుతో సాంకేతికోత్సవాలను నిర్వహిస్తున్నాయి.

ఆకట్టుకునేలా ఆవిష్కరణలు...

యథావిధిగా సాగే క్విజ్, పేపర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలతో పాటు ఈసారి ఆవిష్కరణల విషయంలో విద్యార్థులు ఎక్కువగా దృష్టి సారించారు. ప్రధానంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు రోడ్ల నిర్మాణం విషయంలో ప్లాస్టిక్ రోడ్లు, ట్రాఫిక్ రద్దీ విషయంలో గ్రేడ్ సపరేటెడ్ ఇంటర్ జంక్షన్లు, భూకంపాలను పసిగట్టేందుకు వేక్ లాక్ అలారం సిస్టం వంటి వాటితో పాటు కాళేశ్వరం బ్రిడ్జి నమూన, నగరంలోని కేబుల్‌బ్రిడ్జి నమూనాలను ప్రదర్శించారు.

- అదేవిధంగా అండర్ గ్రౌండ్ ఫ్లట్ కంట్రోలింగ్ సిస్టం, సివిల్ సిటీ ప్రదర్శలను వంటివి విశేషంగా ఆకట్టుకున్నాయి. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో ఆధునిక యంత్ర పరికరాల తయారీ, రోబోటిక్ గేమ్స్, వాహనంలో ఇంజిన్ పనితీరు ప్రదర్శన, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కోడింగ్ గేమ్స్, క్విజ్, నైపుణ్య పత్రాల ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టాయి.



సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



అధికారులు, సిబ్బందితో సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో వాటర్ వర్క్స్, డ్రైనేజీ సిబ్బందితో బుధవారం అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని సూచించారు. డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలను అక్కడే ఉంచకుండా తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా నీటి సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. నిలిచిన వర్షపునీటిని, బురదని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్' తెలంగాణను రావణకాష్టంగా మార్చింది

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ పార్టు-2 దీనబంధు కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ 9 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రాష్ట్ర పరిస్థితి ఉందన్నారు. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లలు, దళిత బంధు, దళితులకు మూడు ఎకరాల భూమి, రైతులకు రుణ మాఫీ, రైతు బంధు, వృద్ధులకు పెన్షన్, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ఇంత వరకు ఏ పథకాలను సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిద్రపోతున్నారని విమర్శించారు.ఆయనకు కబ్జాలు చేయడానికి భూములు తప్ప. పరిష్కరించడానికి ప్రజా సమస్యలు కళ్లకు కనపడవని అన్నారు. త్వరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, నీలం సంధ్య, శ్రీలత, పుప్పాల ప్రభాకర్, ప్రకాష్, మహేందర్, సుకన్య, మాధురి, జ్యోతి, లత, అరుణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.



దీనబంధు కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న గజ్జల యోగానంద్

1 నుంచి నాట్య, సంగీతంలో శిక్షణ

సనత్‌నగర్: నాట్యశిల్పి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి నాట్యం, సంగీతంలో ఉచి త వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యాచార్యులు వాసుకీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని శివాలయం హాల్లో కూ చిపూడి, ఆంధ్రనాట్యం, శివ తాండవం, శాస్త్రీ య నృత్యం, జానపదం, దాండియా, లలిత సంగీతంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10.30 వరకు కొనసాగుతుందన్నారు.

మోదీ నాయకత్వానికి జైకొడితే ప్రజల బతుకులు అధోగతే..

జగద్గిరిగుట్ట: ఉన్నవారికి దోచిపెట్టి పేదవారిని దండుకోవడమే బీజేపీ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని సీపీఐ నాయకులు అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని బుధవారం జగద్గిరిగుట్టలో ప్రారంభించారు. మొదటిరోజు సీపీఐ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్‌నగర్ లాస్ట్‌బస్టాప్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో వారు మాట్లాడారు. ఎన్నో హామీలతో గద్దెనెక్కిన మోదీ ఇప్పుడు పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెంచుతూ పేదలపై మోయలేని భారం వేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మోదీ నాయకత్వానికి జైకొడితే మన బతుకులు అధోగతేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శులు శ్రీనివాస్ , పర్వీనా, సహాయక కార్యదర్శులు దుర్గయ్య, రాము మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు భాస్కర్, సీపీఐ నాయకులు కృష్ణ, సదానంద్, రాములు, సాయిలు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ విద్యా ఫిల్మ్ ఫెస్టివల్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఈ నెల 27 (నేటి) నుంచి 29 వరకు 24వ జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం జరగనుంది. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషన్ నడ్డా ఫిల్మ్ ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు. యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నేడు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ శేఖర్ కమ్ముల హాజరవుతారన్నారు. ఈ నెల 29 వరకు ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో విద్యాకు సంబంధించిన చిత్రాల ప్రదర్శన ఉంటుందని ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి రూ.25 వేల వరకు నగదు బహుమతి, ట్రోఫీ అందచేస్తామన్నారు. చిత్రాల ప్రదర్శన సమయం నేటి మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 28, 29 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో చిత్రాలను ప్రదర్శిస్తారు. చిత్రాలను చూసేందుకు పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు హాజరుకావచ్చని సినిమా చూసేందుకు వచ్చేవారికి ఉచిత భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం ప్రొ. జగత్ భూషన్ నడ్డాతో పాటు సీఈసీ జేడీ సునీల్ నెహ్రూ, వీసీ ప్రొ.రవీందర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'సంతూలన్' కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన 'సంతూలన్' కౌన్సెలింగ్ సెంటర్‌ను వైస్ చాన్సలర్ ప్రొ. కట్టా నర్సింహారెడ్డి బుధవారం ప్రారంభించారు. యూనివర్సిటీలోని విద్యార్థుల ఆందోళలను దూరం చేసి ఆరోగ్యంగా ఉండేందుకు గాను కొత్తగా ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ సెంటర్ దోహదపడుతుందని ఈ సందర్భంగా వీసీ అన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ ఫిజియాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్. బీనా చింతలపూరి సహకారంతో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సదుపాయాలను వీసీ అడిగి తెలుసుకున్నారు. యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్. ఏ. గోవర్ధన్, రిజిస్ట్రార్ ప్రొ. మంజూరు హుస్సేన్‌లతో పాటు పలు విభాగాల అధికారులు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం
జనజీవనం అస్తవ్యస్తం

ఈదురు గాలుల వర్షానికి భయపడ్డ జనం

- భారీ వర్షం కురవడంతో పొంగిపొర్లిన డ్రైనేజీలు
- లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నిలిచిన నీరు
- బుధవారం డివిజన్లలో పర్యటించిన కార్పొరేటర్లు
- సమస్యలు పరిశీలించి తాత్కాలిక చర్యలు
- వర్షాలకు ఏ సమస్య తలెత్తినా సమాచారం ఇవ్వాలని సూచన



హైదర్‌నగర్‌లో వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



రామకృష్ణవీధిలో విరిగిన చెట్లకొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో జనజీవనం స్తంభించింది. భారీ ఈదురు గాలులతో వర్షం పడటంతో చెట్లు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో కార్లు ధ్వంసమయ్యాయి. వర్షం జోరుగా కురవడంతో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రాత్రి వర్షం నిలిచిపోయే వరకు లోతట్టు ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్లు..

డివిజన్లలోని బస్తీలు, కాలనీల్లో బుధవారం ఉదయం కార్పొరేటర్లు పర్యటించి సమస్యలను పరిశీలించారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టికుప్పలు, పడిపోయిన చెట్ల కొమ్మలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని స్థానికులకు తెలిపారు. సహాయక చర్యల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలో దిగి సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించండి:

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలని ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లలో పెద్ద రావి చెట్టు విద్యుత్ తీగల మీద పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అర్ధరాత్రి సమయంలో డీఆర్‌ఎస్ టీమ్‌ను పంపి చెట్టును తొలగింపచేయించారు. ఉదయం నుంచి ఎలమ్మబండ, పీజేఆర్‌నగర్, పాపమ్మ బస్తీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, 2 తదితర కాలనీలో అధికారులతో పర్యటించి పలు సూచనలు అందించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి ప్రాంతాల్లో మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు.



ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్‌లో చెట్ల కొమ్మలను తొలగింపచేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

డివిజన్ ప్రజలు ధైర్యంగా ఉండాలి:

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేష్ నగర్‌లోని లోతట్టు ప్రాంతం జలమయమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అధికారులతో కలిసి బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సహాయ చర్యలను ముమ్మరంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లోతట్టు కాలనీలు, ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ముంపు ప్రాంతాల్లో మోటార్ల ద్వారా నీటిని తొలగించి యథాస్థితికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని,

- ప్రజలు అభద్రతాభావానికి లోను కాకుండా ధైర్యంగా ఉండాలన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించే విధంగా చూడాలని అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు ధైర్యం చెప్పారు.



వెంకటేశ్వరనగర్‌లో విద్యుత్ పనులను పరిశీలిస్తున్న మాధవరం రంగారావు

అప్రమత్తంగా ఉండాలి..

మోతీనగర్: కబీర్‌నగర్ నాలా రిటైనింగ్ వాల్, స్లాబ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంగళవారం కురిసిన భారీ వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అకాల వర్షంతో నాలాలోని నీటి ప్రవాహాన్ని స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నాలా పక్కన నివాసం ఉంటున్న వారి ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరించారు. రాత్రి కూడా వర్షం కురిసే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చెట్టుకొమ్మల తొలగింపు..

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలో అకాల వర్షానికి పటేల్‌కుంట పార్కు ఆనుకొని ఉన్న నివాసాల్లో చెట్టు పడిపోవటంతో వెంకటేశ్వనగర్ కాలనీ 33 బ్లాక్ రోడ్డు నంబర్ 9 నుంచి 11లో కండక్టర్ తెగిపోయి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. దీంతో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు బుధవారం సిబ్బందిని పిలిపించి చెట్టు కొమ్మలు తొలగింపచేయించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడడి విద్యుత్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రామకృష్ణవీధిలో విరిగిన విద్యుత్ తీగలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణవీధిలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి చెట్ల విరిగి విద్యుత్ లైన్లపై పడ్డాయి. దీంతో విద్యుత్ తీగలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి అర్ధరాత్రి లైన్‌మెన్ కోటిరెడ్డిని పిలిపించి విద్యుత్‌ను సరఫరాను పునరుద్ధరింపచేశారు. బుధవారం తెల్లవారుజామున రోడ్డుపై అడ్డంగా పడిన చెట్ల కొమ్మలను తొలగించారు.